క్లుప్తంగా

ఆర్బీకేల్లో 'ఈ-క్రాప్' జాబితా

నకరికల్లు: 'ఈ క్రాప్'లో నమోదు చేసిన పంటలు, రైతుల వివరాల ముసాయిదా జాబితా ఆర్బీకేల్లో ప్రదర్శనకు ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 రబీలో వివిధ పంటల సాగు, విస్తీర్ణం, రైతులు తదితర వివరాలు సామాజిక తనిఖీ కోసం 3వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా తెలపవచ్చని పేర్కొన్నారు.

ఒకేసారి చెల్లింపుతో.. పన్నుపై వడ్డీ మాఫీ

సత్తెనపల్లి: పుర ప్రజలు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను బకాయిలను మార్చి 31లోగా ఒకేసారి చెల్లిస్తే.. వారికి వడ్డీ మాఫీ వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్లు, ఖాళీ స్థలాల పన్ను మొత్తం వడ్డీ రద్దవుతుందని పేర్కొన్నారు. వడ్డీతో పన్ను చెల్లించిన వారికి వచ్చే సంవత్సరం పన్నులో ఆ మొత్తాన్ని మినహాయింపు ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ముగిసిన వాసవీమాత ఆలయ వార్షికోత్సవాలు



అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం 28వ వార్షిక మహోత్సవాలు శనివారం ముగిశాయి.ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి సుప్రభాత సేవ, అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. 24 గంటల పాటు చేపట్టిన అమ్మవారి నామ సంకీర్తన ఏకాహ కార్యక్రమాన్ని పరిసమాప్తి చేశారు. లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, 108 కలశాలతో క్షీర గ్రామోత్సవం, సామూహిక కుంకు మార్చనలు, కలశ క్షీరాభిషేకం, విశేష పూజలు ఘనంగా జరిగాయి. ముందుగా అమ్మవారి జెండా ప్రతిష్టాపక చేశారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి అన్నవరపు సతీ రామస్వామి పట్టువస్త్రాలు బహూకరించారు. అన్నదాన సమారాధన చేపట్టారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు సూరె వెంకట మణికంఠ, అనుముల శేషగిరి, సూరే వెంకట సుబ్బారావు, రామలింగస్వామి పూజా కార్యక్రమాలు పర్యవేక్షించారు.

రేపు దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం

క్రోసూరు: దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆ పార్టీ దివ్యాంగుల సంఘం ప్రతినిధి జెర్రిపోతు చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెలరాజు పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

సకాలంలో రైతులకు సేవలు



సత్తెనపల్లి: రైతులకు అవసరమైన సేవలను అందించడంలో వ్యవసాయ శాఖతో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ముందుంటుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో శనివారం నిర్వహించిన పాలకవర్గ సాధారణ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. చైర్మన్ పెండెం బాబురావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే వ్యవసాయ పనిముట్లను మార్కెటింగ్ పాలకవర్గ సభ్యులకు తెలియజేస్తే.. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు వాటి ఉపయోగాలను తెలియజేస్తారన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఇస్మాయిల్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక



అచ్చంపేట: అర్హతే ప్రమాణికంగా అందుతున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన టీడీపీ కార్యకర్తలంతా ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శనివారం కొండూరు పంచాయతీ శివారు శ్రీనివాస తండాకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కేతావత్ ప్రభునాయక్, కేతావత్ సురేష్ నాయక్, కేతావతు కృష్ణానాయక్, రామావతు రమేష్‌నాయక్, రామావతు గిర్నీబాయి, రామవతు తిరుపతమ్మ బాయి తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ భుక్యా రజనీకృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు సిద్ధం..

క్రోసూరు: మండలంలో 15 సచివాలయాల పరిధిలో 4,722 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ డీవీఎస్ రమాదేవీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమ, మంగళ వారల్లో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి మిగిలిన చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారని పేర్కొన్నారు. 25 కేంద్రాలు, రెండు మొబైల్ బృందాలు ఒక ట్రాన్సిట్ టీమ్, ముగ్గురు రూట్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు.

పోలియో చుక్కలు వేయించాలి

నకరికల్లు: పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని హెచ్‌ఎం షేక్.ఫాహిం అన్నారు. కుంకలగుంట పీహెచ్‌సీ సిబ్బంది చేజర్ల గ్రామంలో విద్యార్థులతో పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహనా ర్యాలీ శనివారం నిర్వహించారు. ఆదివారం అన్ని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఎన్ఎం కుమారి, ఉపాధ్యాయులు షేక్.మస్తాన్‌వలి, చెరుకూరి వెంకటేశ్వర్లు, గేరా మోహన్‌రావు, ఆశ కార్యకర్తలు మరియమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి

అచ్చంపేట: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రాజేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం అచ్చంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అచ్చంపేట పీహెచ్‌సీ పరిధిలో 0-5 సంత్సరాలలోపు పిల్లలు 3,857మంది ఉన్నారని తెలిపారు. రెండు రూట్లలో 23 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రెండు మొబైల్ టీమ్‌లు మండలం మొత్తం పర్యవేక్షిస్తుందని చెప్పారు. మొత్తం 144 మంది సిబ్బంది నియమించినట్లు చెప్పారు.

రాజుపాలెంలో 3,865 మంది చిన్నారులకు



అచ్చంపేటలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పెదనెమలిపురిలో అవగాహన ర్యాలీ



చేజర్ల గ్రామంలో..

రాజుపాలెం: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ వెంకట కృష్ణకుమార్ అన్నారు. పెదనెమలిపురి గ్రామంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించాలని, మిగిలిన వారికి 4, 5 తేదీల్లో ఇంటింటికి తిరిగి వైద్య సిబ్బంది పోలియోచుక్కలు వేయనున్నట్లు తెలిపారు. మండలంలో 3,865 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారని, వారి కోసం 23 కేంద్రాలు, ఒక మొబైల్ వాహనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పల్స్‌పోలియోపై అవగాహన

ముప్పాళ్ల: పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి, జయకృష్ణ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమంపై శనివారం వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించి, ర్యాలీ చేశారు.



ముప్పాళ్లలో వైద్య సిబ్బంది ర్యాలీ..

మండలంలో మొత్తం 4,381 మంది చిన్నారులు ఉన్నారని, వారికి పోలియో చుక్కలు వేసేందుకు.. 68 మంది సిబ్బంది, 17 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ర్యాలీల్లో సీహెచ్‌ఓ ఆంజనేయులు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎ.పీటర్ డేమియన్, జోస్పిన్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కులు పంపిణీ



బాధితులకు నగదు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

క్రోసూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం పంపిణీ చేశారు. పెదకూరపాడు మండలం గారపాడుకు చెందిన వేములరి మల్లికార్జునరావుకు రూ. 2 లక్షలు, రామాపురం గ్రామానికి చెందిన సుంకర అచ్చయ్యకు రూ.1.30 లక్షలు, కంభంపాడుకు చెందిన గోగులపాటి యశ్వంత్‌కు రూ.35 వేలు, పెదకూరపాడుకు చెందిన ఆలరాణి గంగమ్మకు రూ.18 వేలు, బలుసుపాడుకు చెందిన ఏపూరి నాగేశ్వరరావుకు రూ.50 వేలు, లింగంగుంట్లకు చెందిన ఎండ్లూరు ఠాగూర్ చౌదరికి రూ.40 వేలు, పాటిబండ్లకు చెందిన సయ్యద్ రహీమ్‌కు రూ.75 వేలు, అమరావతి మండలం లింగాపురం గ్రామానికి చెందిన చిరుమామిళ్ల కృష్ణమూర్తికి రూ.1.10 లక్షలు, క్రోసూరుకు చెందిన చిలకా రెబ్బమ్మకు రూ.40 వేలు, బోడె అప్పారావుకు రూ.65 వేలు, 75త్యాళ్లూరుకు చెందిన ఊర అఖిల్‌కు రూ.22 వేలు, ముప్పాళ్ల మండలం పలుదేవర్ల పాడుకు చెందిన గుమ్మడి రాణికి రూ.40 వేలు, గుంటూరుకు చెందిన కన్నెగంటి ఏకోబుకు రూ. 60 వేలు అందజేశారు. క్రోసూరు ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు రూ. 2.14 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డు



కమ్యూనిటీ హాలు



వైఎస్సార్ విగ్రహం

సత్తెనపల్లి: మండలంలోని ధూళిపాళ్ల ప్రధాన రహదారికి మోక్షం లభించింది. గుంటూరు -మాచర్ల ప్రధాన రహదారి నుంచి ధూళిపాళ్లలోని తొండపి వెళ్లే గ్రామం వరకు కిలోమీటరు పొడవున ఆర్ అండ్ బీ నిధులు రూ.1.68 కోట్లతో సీసీ రోడ్డు వేశారు. ఈ రోడ్డుతో పాటు ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీలో రూ.46 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలు, భాగ్యనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం, వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరగనుంది. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్, గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణతో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరుకానున్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పార్టీ మండలాధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యకర్తలకు ఉన్నత పదవులు



షేక్ జానీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట సర్పంచ్ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే నంబూరు

అచ్చంపేట: సామాన్య కార్యకర్తలకు సైతం ఉన్నత పదవులిచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. స్థానిక ఆంజనేయస్వామి విగ్రహ సెంటర్‌లో శనివారం రాత్రి అచ్చంపేట గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా షేక్ జాని ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సామాన్య కార్యకర్తలుగా ఉన్న వీరబాబు, జానీలను సర్పంచ్‌లను చేసుకున్నామని ఎమ్మెల్యే చెప్పారు. మూడేళ్ల వీరబాబు సర్పంచ్‌గా చేసి, వ్యక్తిగత కారణాలతో సెలవు పెట్టడంతో.. ఉప సర్పంచ్‌గా ఉన్న షేక్ జానీని సర్పంచ్‌గా ఎన్నుకోవడం జరిగిందన్నారు. గత ఐదేళ్లలో అచ్చంపేటలో రూ.60 కోట్ల సంక్షేమ, అభివృద్ధి పనులు జరిగాయని, నిరుపేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను కూడా లెక్కించుకుంటే రూ.80 కోట్లు దాటుతుందన్నారు. అచ్చంపేట చరిత్రలో ఒక సర్పంచ్‌కి వచ్చిన 4 వేలకు పైగా మెజార్టీని పునరావృతం చేయడం ఎవరికీ సాధ్యపడదన్నారు. వీరబాబు, జాని అన్నదమ్ముల్లా సహకరించుకుంటూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని చెప్పారు. ప్రజలు మళ్లీ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమానికి పార్టీ మండలాధ్యక్షుడు చిల్కా చంద్రయ్య అధ్యక్షత వహించారు. గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఈదా సాంబిరెడ్డి, సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, ఎంపీపీ భుక్యా రజనీ కృష్ణానాయక్, టీవీఎస్ మల్లికార్జునరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సాతర శ్రీనివాసరావు, ఎంపీటీసీ మేకల నాగరాజు, టౌన్ పార్టీ కన్వీనర్ షేక్ సైదావలి, లిడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, మేకల శ్రీనివాసరావు, అంబటి నారాయణ, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి రంగయ్య, మైనార్టీ నాయకులు షేక్ కమల్‌సైదా, బీరువాల జాని, షేక్ సుభాని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమరావతి: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ అశోక్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి, వైకుంఠపురం, పెదమద్దూరు, చావపాడు, ఎంద్రాయి, నరుకుళ్లపాడు, ధరణికోట, ముత్తాయపాలెం, దిడుగు, లింగాపురం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరపరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

డబుల్ ఎంట్రీలను రిమార్క్‌గా చూపించాలి

రాజుపాలెం: ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు ఉంటే రిమార్క్‌గా చూపించాలని తహసీల్దారు ఎస్.హరిబాబు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్వోలతో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ రానున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సెలవులు పెట్టేవాళ్లు రెండు రోజుల ముందుగానే తెలియజేయాలని స్పష్టం చేశారు.

సమైక్యతతో ప్రకృతి వ్యవసాయాన్ని నిర్వహించాలి



ఈపూరు: మండల కేంద్రంలో మండల సమైక్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రంగారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి మండల సమైక్యలు ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీగా బాధ్యతలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దీని ద్వారా ప్రకృతి వ్యవసాయం మండలంలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా వ్యాపించేందుకు దోహదపడుతుందని సూచించారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ సైదయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా విషరహిత ఆహారం లభించడంతో పాటు రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి రైతు కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు. పెరటి తోటలు పెంచడం ద్వారా కుటుంబం ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు. కార్యక్రమంలో సీసీలు సుబ్బారావు, రామారావు, రాజు, హనుమంతరావు, గిరి, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ తిరుపతిరావు, భాస్కర్ రావు, యూనిట్ ఇన్‌చార్జి లక్ష్మ నాయక్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఏబీఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

బెల్లంకొండ: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ మంచి చేసే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అందరూ అండగా ఉండాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం మాచాయపాలెం గ్రామంలో జగనన్న ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పట్టాలు ఇవ్వడమే కాకుండా వాటిని లబ్ధిదారులైన మహిళల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మంచి చేసిన ప్రభుత్వాన్ని గుర్తించి, మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామనబోయిన ఆదిగోపాలరావు, ఎంపీటీసీ భుక్యా శ్రావణిబాయి, వీఆర్వో శాస్త్రి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీబాయి, నాయకులు చింతారెడ్డి సాయిరెడ్డి, లక్ష్మీ నారాయణ. కొండెబోయిన శ్రీను, భూపాల్‌రెడ్డి, నరసింహానాయక్, మరియదాసు పాల్గొన్నారు.

విద్యార్థి శస్త్రచికిత్సకు రూ.31వేలు విరాళం



విరాళం నగదు అందజేస్తున్న లక్ష్మీపతి

నకరికల్లు: విద్యార్థి శస్త్ర చికిత్సకు జి.కె.స్కూల్ తరపున రూ.31వేల విరాళం శనివారం అందజేసినట్లు ప్రిన్సిపల్ లక్ష్మీపతి తెలిపారు. స్థానిక పాతూరుకు చెందిన షేక్.మహ్మద్ అనస్ ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడని, రెండురోజుల క్రితం ప్రమాదవశాత్తు పడడంతో గొంతుకు తీవ్రగాయమైందని తెలిపారు. హైదరాబాద్‌కు శస్త్రచికిత్స నిమిత్తం తీసుకెళ్లగా దాతలు విరాళాలు అందజేశారని చెప్పారు. స్థానిక జి.కె. స్కూల్ సిబ్బంది, యాజమాన్యం, విద్యార్థుల తరపున నగదును విద్యార్థి తాత షేక్.రహీంకు అందజేసినట్లు తెలిపారు.

బాలికల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

అచ్చంపేట: బాలికలకు రక్షణ కల్పించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో బేటి బచావో- బేటి పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో కె.స్వర్ణకుమారి అధ్యక్షతన శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. బాలికలపై జరిగే అఘాత్యాల నుంచి విముక్తి పొందేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బాల్య వివాహాల వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయడం ద్వారా వారి జీవితాల్లో విషాదం చోటు చేసుకుంటుందన్నారు. లింగ నిర్ధారణకు స్వస్తి పలకాలని, నవతరానికి నాంది పలకాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆడ పిల్లలను మగ పిల్లలతో సమానంగా బాగా చదివించాలన్నారు. పలు రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, అచ్చంపేట, క్రోసూరు ఎంపీపీలు భూక్యా రజనీకృష్ణానాయక్, పేరుమామిళ్ల కోటయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు షేక్ జమీలగఫూర్, తహసీల్దారు సువర్ణ, ఎంఈవోలు రాజకుమారి, నరసింహారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో కంది పంటకు సరైన మద్దతు ధర

- మార్కెట్ ధరకే కంది కొనుగోళ్లు
- జిల్లా వ్యవసాయాధికారి మురళి

నాదెండ్ల: ఖరీఫ్ సీజన్‌లో పండిన కంది పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ ధరకు అనుగుణంగా కొనుగోలు చేస్తున్నట్లు పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళీ చెప్పారు. నాదెండ్ల మండలం కనపర్రు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటా రూ.9614.93 పైసలు కాగా, మరో రూ.74.65 పైసలు కూలీ, రవాణా ఖర్చుల నిమిత్తం చెల్లిస్తున్నామన్నారు. మొత్తం మీద క్వింటా ధర రూ.9689.58 పైసలు రైతుల ఖాతాల్లో నేరుగా జమ అవుతాయని, రైతులు రబీలో వేసిన పంట ఉత్పత్తులను అమ్ముకోవాలని కోరారు. విత్తన కొనుగోలు నుంచి పంట ఉత్పత్తుల వరకూ మార్కెట్ ధరలకు అమ్ముకునే వెసులుబాటుతో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని ఆయన వివరించారు. అనంతరం రబీ సీజన్‌లో వేసిన పంటల వివరాలతో పొందుపరచిన సామాజిక తనిఖీ రిపోర్టును ఆయన పరిశీలించారు. కొద్దిసేపు స్థానిక రైతులతో మాట్లాడారు. సామాజిక తనిఖీలో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే ఈ నెల 5వ తేదీలోగా రాతపూర్వకంగా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఆయనతో పాటూ జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏడీఏ రవికుమార్, స్థానిక వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్, వీహెచ్‌ఏ రామాంజమ్మ ఉన్నారు.



కనపర్రులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

20 మెట్రిక్ టన్నులు కందులు కొనుగోళ్లు

శావల్యాపురం: ప్రభుత్వ ఆదేశాలు మేరకు కందులు క్వింటా మద్దతు ధర 9680 రూపాయలకు రైతు భరోసా కేంద్రాల్లో పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ శనివారం తెలిపారు. కంది పంట సాగు చేసిన దళారుల నుంచి మోసపోకుండా ఉండటానికి నేరుగా రైతుభరోసా కేంద్రాల ద్వారానే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన రెండు రోజుల వ్యవధిలో రైతు బ్యాంకు ఖాతాలో నేరుగా నగదును ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. గత వారం రోజుల నుంచి 20 మెట్రిక్ టన్నులు కందులు రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. రైతులకు గోనె సంచులు, కూలీ, రవాణ ఖర్చు అంతా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. చివరి గింజ వరకు కంది పంటను కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు.

సమస్య పరిష్కారంలో బాధ్యతగా వ్యవహరించాలి

- అప్పుడే పట్టణ సుందరీకరణ సాధ్యం
- మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నరసరావుపేట: ప్రతీ ఒక్క సెక్రటరీ ప్రతిరోజూ వార్డులో పర్యటిస్తూ చెత్త, డ్రెయిన్లు, నూతన నిర్మాణాలతో పాటు ప్రతి సమస్యను పరిశీలించి, వార్డు ప్రజల ద్వారా తెలుసుకునీ రిజిస్టర్‌లో నమోదుచేసి వెంటనే పరిష్కరించటం ప్రథమ బాధ్యతగా చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. అప్పుడే పట్టణ సుందరీకరణ సాధ్యమౌతుందన్నారు. శనివారం వార్డు శానిటేషన్, ప్లానింగ్, ఎమినిటీ సెక్రెటరీలతో మున్సిపల్ బంగ్లాలో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. తమ దృష్టికి వచ్చిన సమస్య ఇది మా సమస్య కాదని, వేరే సెక్రటరీ క్లియర్ చేస్తారని చెప్పకుండా సచివాలయంలో తోటి సెక్రటరీలతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలన్నారు.

నూతన భవన నిర్మా ణం జరిగేటప్పుడు ప్లానింగ్ సెక్రటరీ వాటి యజమానులకు డ్రైన్స్‌పై ఎటువంటి నిర్మాణ మెటీరియల్ పడకుండా బండలు వేసుకోవాలని, అదేవిధంగా ర్యాంప్‌లు కట్టేటప్పుడు డ్రైన్లలో పూడిక తీసేందుకు అనువుగా మధ్యలో గ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు సూచించాలన్నారు. శానిటేషన్ సెక్రటరీ ప్రతిరోజు వార్డులో తిరిగేటప్పుడు డ్రైన్లలో ఎక్కడైనా మురుగు ఆగి ఉందా, ఆగితే అడ్డంకిగా ఏమున్నాయో నోట్ చేసుకొని వర్కర్స్ ద్వారా వాటి అన్నింటిని క్లియర్ చేయించాలన్నారు. వార్డు ఏమినిటీ సెక్రటరీలు తమ వార్డులో ఎక్కడైతే డ్రాయింగ్స్ సక్రమంగా లేవో, డ్రెయిన్లు డ్యామేజీ అయితే వాటిని నోట్ చేసుకొని సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్‌కి నివేదించాలని, వాటికి సంబంధించిన నూతన డ్రెయిన్ల నిర్మాణ పనులకు అంచనాలు వేసి వాటి స్థానంలో నూతన నిర్మాణం చేయడం జరుగుతుందని తెలియజేశారు. వార్డులు సుందరంగా ఉండటంలో సెక్రటరీల పాత్ర ముఖ్యమైనదని కావున ప్రతి ఒక్కరూ తమ సొంత బాధ్యతగా తీసుకుంటే ఈ నగరాన్ని మరింత సుందరవనంగా తీర్చిదిద్దుకోవచ్చని తెలియజేశారు. పట్టణ ప్రజలు కూడా పురపాలక సంఘానికి సహకరిస్తూ తమ భవన నిర్మాణ పనులు చేసేటప్పుడు మీరే స్వతహాగా ఇలాంటివి ఏర్పాటు చేసుకున్నట్లయితే మరింత సులువుగా సమస్యను పరిష్కరించే విధంగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఇ ఓలేటి శ్రీనివాసరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట కోటయ్య, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్లు రాము నాయక్, స్వర్ణరాజు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలు ప్రకృతి సాగువైపు మళ్లాలి

ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం అమలకుమారి

యడ్లపాడు: ఇకపై స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా డీపీఎం కె.అమలకుమారి చెప్పారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె సమాఖ్య ప్రతినిధులకు, పొదుపు సంఘాల లీడర్లకు ప్రకృతి వ్యవసాయ విధాలనాలు, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ప్రకృతి సేద్యంతోనే సాధ్యమన్నారు. పురుగు మందులు లేని ఆరోగ్యం, ఆనందం పంచే నాణ్యమైన ఉత్పత్తులు దిగుబడి చేయవచ్చన్నారు. తద్వారా భూసారం కూడా దెబ్బతినకుండా ఉంటుందని వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్ని అమలు చేసేందుకు సమాఖ్య ప్రతినిధులు తీర్మానించడంతో అందరూ ఆమోదించారు. ఏడీపీఎం వంగూరి ప్రేమరాజు, ఏపీఎం జీవన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆర్ సెల్వీ, కార్యదర్శి ఏ శ్రీలక్ష్మి, కోశాధికారి థామసమ్మ, వివిధ గ్రామాల సంఘలకు చెందిన లీడర్లు పాల్గొన్నారు.